
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 29 నవంబరు 2024



ఆటోలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం
సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో సంఘటన
7





ఐబీ వద్ద వాహనదారుడిపై పడిన ఫ్లెక్సీ



ఫ్లెక్సీ వార్.. జనం బేజార్!

- సంగారెడ్డిలో విచ్చలవిడిగా కటౌట్లు
- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- రక్షణ చర్యలు కరువు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఐబీ వద్ద విరిగి పడిన భారీ ఫ్లెక్సీ
- వాహనదారుడికి తీవ్ర గాయాలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఫ్లెక్సీల యుద్ధం జరుగుతోంది. పండగ వచ్చినా, నాయకుల బర్త్‌డే అయినా, సభలు, సమావేశాలైనా పట్టణం మొత్తం ఫ్లెక్సీలతో నిండిపోతుంది. చోటా మోటా నాయకుల నుంచి మొదలు ఎమ్మెల్యే దాకా ప్రతి ఒక్కరూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సర్వసాధారణంగా మారింది. పట్టణ నడిబొడ్డున ఉన్న రహదారుల బంగ్లా ఆవరణ మొత్తం ఫ్లెక్సీలే దర్శనమిస్తాయి. రోడ్డు పక్కన ఉన్న ఫ్లెక్సీలు ఎప్పుడు మీదపడతాయోననే ఆందోళన వాహనదారుల్లో వ్యక్తమవుతోంది.



ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

త్రుటిలో తప్పిన ప్రమాదం

సంగారెడ్డి పట్టణంలోని రహదారుల బంగ్లా వద్ద గురువారం ఉదయం ఓ భారీ ఫ్లెక్సీ విరిగి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భారీ ఫ్లెక్సీలు ఇష్టారీతిన ఏర్పాటు చేయడం, కనీస నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఫ్లెక్సీల ఏర్పాటుకు మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఫ్లెక్సీ సైజుకు తగినట్టు మున్సిపాలిటీకి పన్ను చెల్లించాలి. ఇందుకోసం ఎన్నిరోజులు, ఏ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారనే వివరాలు ముందుగా తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఫ్లెక్సీలు పెట్టేవారు ఈ నిబంధనలేవీ పట్టించుకోకపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని రోడ్డు డివైడర్‌కు ఇరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అవి రోడ్డుపై పడడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీల నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకోవడం వల్లే మున్సిపల్ అధికారులు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం



జిన్నారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కాజీపల్లి పారిశ్రామిక వాడలోని అరోర్ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తెల్లవారుజాము 4:30గంటల ప్రాంతంలో పరిశ్రమ 2బీ బ్లాక్‌లో విద్యుత్ మోటారు వద్ద చెలరేగిన మంటలు కెమికల్ రియాక్టర్లకు అంటుకొని భారీగా అగ్నికీలలు ఎగసి పడ్డాయి. నైట్‌డ్యూటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. రసాయనాల ధాటికి అగ్నికీలలు భారీ ఎత్తున ఎగిసిపడటంతో స్థానిక హెటిరో పరిశ్రమకు చెందిన ఫైరింజన్‌తోపాటు జీడిమెట్ల నుంచి మరో ఫైరింజన్ ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశాయి. రెండు గంటల పాటు ఫైర్ సిబ్బంది శ్రమించి, ఉదయం 6:30గంటలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తుండగా.. ప్రమాదంలో కార్మికులు ఎవరికి గాయాలు కాలేదు. ఆస్తినష్టం భారీగానే జరిగిందని తెలుస్తుంది. ఘటన స్థలానికి బొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు చేరుకొని ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు.

సన్నాల ధరలు హై..

కొనుగోలు కేంద్రాలకు నై!! ● ఇప్పటి వరకు వచ్చింది 13వేల మెట్రిక్ టన్నులే!!

- క్వింటాలు వడ్లకు రూ. 2,800, బియ్యం రూ. 5,500
- మద్దతు ధర కంటే రూ. 500 ఎక్కువ చెల్లిస్తున్న వ్యాపారులు
- కల్లాల వద్దనే కొనుగోలు
- మరాడించి బియ్యం విక్రయిస్తున్న మరికొంతమంది రైతులు



మెదక్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోనస్ ఇస్తామన్నా సన్న వడ్లు కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. బియ్యానికి డిమాండ్ విపరీతంగా ఉండడంతో రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి ముందుకురావడంలేదు. మెదక్ జిల్లాలో అధికంగా బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్, ఆమని, సూపర్ ఆమని తదితర సన్నరకాలను సాగు చేస్తారు. ఈసారి సన్నాల సాగు పెరగడం, ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లు సేకరించాలని పౌర సరఫరాలశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేంద్రాలకు 13వే మెట్రిక్ టన్నుల సన్న వడ్లు మాత్రమే వచ్చాయి. రైతులు సన్న రకాలను కేంద్రాల్లో విక్రయించేందుకు మొగ్గుచూపడంలేదు.

వ్యాపారుల జోరు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. కాంటా పెట్టడానికి హమాలీ చార్జీలు రైతులే చెల్లించాల్సి వస్తున్నది. డబ్బుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతున్నది. దీంతో రైతులు సన్న వడ్లను మార్కెట్‌లో విక్రయించేందుకే మొగ్గుచూపుతున్నారు. సన్నాలకు కేంద్రం రూ.2,320 మద్దతు ధర ప్రకటించింది. సన్నరకం ధాన్యం ధర మెదక్ జిల్లా పరిధిలోని మిల్లుల్లో క్వింటాలుకు రూ2,800 వరకు ఉన్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.450 ఎక్కువ లభిస్తుండడంతో రైతులు సన్న వడ్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించడానికే మొగ్గు చూపుతున్నారు. తేమ శాతంతో నిమిత్తం లేకుండా మిల్లర్లు, దళారులు నేరుగ కల్లాల వద్దకే వెళ్లి సన్న వడ్లను కొనుగోలు చేస్తున్నారు. వెంటనే రైతుకు డబ్బు ఇస్తున్నారు. హమాలీల చార్జీలు కూడా వారే చెల్లిస్తున్నారు. దీంతో, కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్ల సేకరణ లక్ష్యం 50 కూడా మించదేమోనని అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

వడ్లు అమ్మేందుకు ససేమిరా..

మరోవైపు కొందరు రైతులు సన్నవడ్లను స్వయంగా మర పట్టించి బియ్యం విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో సన్నబియ్యం కొత్తవి క్వింటాలుకు రూ. 5,500 విక్రయిస్తున్నారు. తమకు పరిచయం ఉన్న వ్యక్తులే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం వరి కోతలు పూర్తవగానే రైతులను సంప్రదిస్తున్నారు. ముందుగా చెప్పినవారికి కొందరు రైతులు డోర్ డెలివరీ చేస్తున్నారు. మరోవైపు తమిళనాడుకు కూడా మన బియ్యం భారీగా ఎగుమతి చేస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో సన్న బియ్యం మరింత పెరుగుతాయని హోల్‌సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



ఇంద్రేశంలో భోజనాన్ని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



కొత్తపల్లిలో అక్షయపాత్ర భోజనాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

గురుకులాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్‌చెరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ విద్యార్థుల భోజన వసతుల్లో రాజీపడితే సహించేది లేదని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సిబ్బందిని హెచ్చరించారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం, పెద్దకంజర్లలోని గురుకుల పాఠశాలలను గురువారం ఆమె తనిఖీ చేశారు. కిచెన్, భోజనశాల, స్టోర్‌రూంలను పరిశీలించారు. తాజా కూరగాయలను వినియోగించాలని, శుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలను వండి వేడివేడిగా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంద్రేశం ఉన్నత పాఠశాలను తనిఖీచేశారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు సెలవు పెట్టకుండానే పాఠశాలకు గైర్హాజరైనట్లు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంఈవోను ఆదేశించారు.

భోజనం నాణ్యంగా ఉండాలి : మెదక్ కలెక్టర్

పాపన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందజేసే భోజనం నాణ్యతతో ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో ఉన్న బీసీ బాలుర వసతిగృహం, ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన, శుభ్రమైన భోజనం అందజేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.



రూ. 7 కోట్ల భూమి స్వాహా

- అసలు యజమాని మరణం..
- భూమిపై కన్నేసిన మాజీ ప్రజాప్రతినిధి
- మృతుడికి భూమి అమ్మినవారి పేరిట నకిలీ ధ్రువపత్రాలు
- తొలుత ఓ ప్రజాప్రతినిధికి, అతడి నుంచి మరొకరికి విక్రయం
- రాజకీయ పలుకుబడితో కప్పిపుచ్చే యత్నం!

జోగిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తి పేరిట ఉన్న రూ. 7 కోట్ల విలువైన భూమిని ఓ మాజీ ప్రజాప్రతినిధి కబళించాడు. మృతుడి వారసులు విదేశాల్లో ఉండడం, భూమి ఖాళీగా ఉండడంతో బరితెగించాడు. మృతిచెందిన వ్యక్తికి భూమి అమ్మిన వ్యక్తుల (వారు కూడా చనిపోయారు) పేరిట నకిలీ ఆధార్ కార్డులు, పట్టాదారు పాసు పుస్తకాలు, ధ్రువపత్రాలను సృష్టించి మరో తాజా మాజీ ప్రజాప్రతినిధికి భూమిని బదలాయించారు. అతడి నుంచి మరొకరికి విక్రయించారు. విదేశాల నుంచి వచ్చిన అసలు వారసులు విషయం తెలుసుకుని.. తమకు తెలిసిన ఓ పోలీసు అధికారికి మొర పెట్టుకున్నారు. కానీ నిందితుడు అధికార పార్టీ ముఖ్య నేతకు అనుచరుడు కావడంతో పోలీసులు చేతులెత్తేయడంతో కోర్టును ఆశ్రయించారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అందోలు మండలం డాకూరు గ్రామ పరిధిలోని సర్వే నంబరు 679 (అ), (ఆ), (ఇ)లో 6.5 ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన భాస్కర్‌రావు అనే వ్యక్తి డాకూరుకు చెందిన జయరాంగౌడ్, నారాయణగౌడ్, రామాగౌడ్, చెన్నాగౌడ్ నుంచి కొనుగోలు చేశారు. ఆ తరువాత వీరి నుంచే మరో రెండెకరాలు, దాని పక్కనే ఉన్న మరో ఇద్దరు వ్యక్తుల నుంచి రెండెకాలు, 1.5 ఎకరాల చొప్పున (మొత్తం 11.5 ఎకరాలను) భాస్కర్‌రావు కొనుగోలు చేశారు. మొత్తాన్ని వ్యవసాయ క్షేత్రంగా అభివృద్ధి చేసి గ్రామానికే చెందిన రైతులతో వ్యవసాయం చేయించేవాడు. ఐదేళ్ల క్రితం భాస్కర్‌రావు మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులు, వారసులు విదేశాల్లో ఉండడంతో భూమి గురించి పట్టించుకోలేదు. భూమి ఖాళీగా ఉండడం, వారసులెవరూ రాకపోవడం గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్నేశాడు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి సహకారంతో.. భాస్కర్‌రావుకు భూమిని అమ్మిన జయరాంగౌడ్, రామాగౌడ్ పేరిట నకిలీ ఆధార్‌కార్డులు, భూయాజమాన్య పత్రాలను సృష్టించాడు. వారి పేరిట 6 ఎకరాల భూమిని నియోజకవర్గానికే చెందిన మరో మాజీ ప్రజాప్రతినిధికి బదలాయించారు. ఆయన నుంచి మరో వ్యక్తికి రూ. 7 కోట్లకు విక్రయించినట్టు సమాచారం.

వారసులు రావడంతో వెలుగులోకి..

భూ యజమానికి భాస్కర్‌రావు వారసులు ఆర్నెళ్ల క్రితం ఇండియాకి వచ్చారు. తమ తండ్రి పేరిట డాకూరు రెవెన్యూ పరిధిలో 11.10 ఎకరాల భూమి ఉన్నట్టు భూయాజమాన్య పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగా గుర్తించారు. పౌతీకి దరఖాస్తు చేసుకునే క్రమంలో సదరు భూమిలో 6.5 ఎకరాలు మరొకరి పేరిట ధరణి రికార్డుల్లో కనిపిస్తుండడంతో అవాక్కయ్యారు. తమకు పరిచయం ఉన్న ఓ మాజీ పోలీసు ఉన్నతాధికారి ద్వారా పోలీసులకు, రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, సదరు మాజీ ప్రజాప్రతినిధికి రాజకీయ నాయకుల అండదండలుండడంతో చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకాడారు. ఆరు నెలలైనా పోలీసులు వాయిదా వేస్తుండడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు.

అధికారుల అండదండలతోనే..!

భూమిని విక్రయించేందుకు ఎప్పుడో చనిపోయిన వ్యక్తుల పేరిట నకిలీ డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలను రెవెన్యూ అధికారుల అండదండలు లేకుండా తయారు చేయడం సాధ్యం కాదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం బయటపడినా రెవన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ చేస్తున్నాం

డాకూరు భూవిక్రయం ఘటన జరిగినప్పుడు నేను ఇక్కడ పనిచేయలేదు. ప్రస్తుతం వస్తున్న ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. త్వరలోనే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

-విష్ణుసాగర్, అందోలు తహసీల్దార్

మహిళలకు మగ్గ వర్క్‌లో ఉచిత శిక్షణ

● ఎస్‌బీఆర్‌ఎస్ఈటిఐ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్

సంగారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఎస్‌బీఆర్‌ఎస్ఈటీఐ) డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన వారై 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులన్నారు. మహిళలు దరఖాస్తు ఫారంతో పాటు రేషన్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటోలు, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్సు ప్రతులు జతచేయాలని సూచించారు. ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం 9704446956, 9490129839 నంబర్లలో సంప్రదించాలని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

'ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజన పనుల నుంచి మినహాయించాలి'


మాట్లాడుతున్న ఎల్లం

మెదక్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజన పనుల నుంచి మినహాయించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, చల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు వాస్తవ ధరలకు అనుగుణంగా వంట చార్జీలు ఇవ్వాలన్నారు. పాఠశాలలో వంట నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వం నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

● మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మూఢ విశ్వాసాలను నమ్మొద్దని, శాస్త్ర విజ్ఞానాన్ని పెంచుకోవాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో చెకుముకి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియంలో జడ్పీహెచ్ఎస్(రాజ్‌పల్లి), తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్(మాచవరం), ప్రైవేటు ఇంగ్లీష్ విభాగంలో వివేకానంద పబ్లిక్ స్కూల్(రామాయంపేట) ప్రథమస్థానంలో నిలిచాయి. వీరికి డీఈవో, అధికారులు ధ్రువపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మోహన్ రావు, దేవుల్లా, హెచ్ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో రామాయంపేటలోని వివేకానంద విద్యార్థులు ఆర్. విష్ణు, సిరివదన, సారిక ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి


మెదక్ అర్బన్: విజేతలకు బహుమతి అందజేస్తున్న డీఈవో రాధాకిషన్


సంగారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయికి ఎంపికైన ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

సైన్స్ టాలెంట్ టెస్ట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని జడ్పీ హాల్‌లో గురువారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జడ్పీ సీఈవో జానకీరెడ్డి పరీక్ష పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, సంగారెడ్డి, కంది మండలాల ఎంఈవోలు మాట్లాడారు. పోటీల్లో కంది మండలం ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్, కొండాపూర్ మండలం అనంతసాగర్ ప్రాథమికోన్నత పాఠశాల, కందిలోని మైనారిటీ గురుకుల పాఠశాల, విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు వచ్చేనెల 14 నుంచి 16వ తేదీవరకు ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గైని బాలయ్య తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి సాయితేజ, రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్, జిల్లా కోశాధికారి ప్రశాంత్, గౌరవ అధ్యక్షుడు జాన్‌పాల్, మహేశ్‌చారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా నేరమన్నారు. డీసీపీవో రత్నం, డీఐఈవో గోవిందరామ్, సఖి అడ్మినిస్ట్రేటర్ కల్పన, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, స్కోప్ జిల్లా సమన్వయకర్త మాణయ్య మాట్లాడారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో వనభోజనాలు

శివ్వంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో అంగన్‌వాడీ కేంద్రం ఒకటి, రెండు, మూడు సెంటర్ల పిల్లలతో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల సూపర్‌వైజర్ సంతోష హాజరయ్యారు. పిల్లలతో పల్లె ప్రకృతివనాన్ని సందర్శించి దుర్గమ్మ ఆలయం వద్ద వన భోజనాలు చేయడం జరిగిందని అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తెలిపారు.

ఎంపీ సురేష్ షెట్కార్‌ను అభినందించిన రాహుల్



నారాయణఖేడ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అభినందించారు. మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంట్ స్థానానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇన్‌చార్జిగా సురేష్ షెట్కార్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలవంతరావు రవీందర్ చౌహాన్ ఎన్నికయ్యారు. గురువారం ప్రియాంక గాంధీ, బలవంతరావు రవీందర్‌చౌహాన్ పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో చౌహాన్ విజయంలో కీలకపాత్ర పోషించారంటూ షెట్కార్‌ను రాహుల్ గాంధీ అభినందించారు.

నల్లవాగు ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్

రూ.73.70 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు

కల్హేర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏకైక మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టుపై ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ మేరకు రూ. 73.70 కోట్ల పనులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో పరిపాలన అనుమతులు ఇచ్చినట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరావు తెలిపారు. మంజీరా నది నుంచి నల్లవాగుకు నీటిని ఎత్తిపోసేందుకు తాను రూ. 90 కోట్లతో ప్రతిపాదనలు ఇవ్వగా, మంత్రి రూ.73.70 కోట్లకు ఆమోదం తెలిపారని అన్నారు. నల్లవాగు ప్రాజెక్టుకు భారీ వరద ఇన్‌ఫ్లోగా వస్తున్నప్పటికీ ప్రాజెక్టులో 40 శాతం పూడిక ఉన్నందున నీటినిల్వ అధికంగా ఉండటం లేదని, పూడిక తొలిగింపుతో పాటు, కుడి, ఎడమ కాలువల మరమ్మత్తులకుగానూ తాను మంత్రికి ప్రతిపాదనలు పంపగా, మొదటి విడతలో కాలువల మరమ్మత్తు పనులకు ఆమోదం తెలుపడంతో పాటు సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి దన్యవాదములు తెలిపారు.



రాజీవ్ రహదారి పక్కన గౌరారం వద్ద హోటళ్లు, రెస్టారెంట్లు

గౌరారం ఘుమఘుమా

రెస్టారెంట్లు, టిఫిన్‌లు, స్నాక్స్‌కు కేరాఫ్.. ఆరు జిల్లాల వాహనదారులకు అడ్డా

- సాయంత్రమైందంటే చాలు జనసందోహం
- వాహనాలకు పార్కింగ్ దొరకని పరిస్థితి

వర్గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని గౌరారం ప్రాంతం ఫుడ్‌స్పాట్‌గా మారింది. సిద్దిపేట నుంచి రాజీవ్‌రహదారి వెంట హైదరాబాద్‌కు వెళుతుండగా, నగరానికి యాభై కిలో మీటర్ల దూరం ఉందనగా వస్తుంది గౌరారం. మొదట్లో చిన్న చిన్న హోటల్‌లు మాత్రమే ఉన్న ఈ ప్రాంతంలో ఇటీవల ఫేమస్ రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు వెలిశాయి. సింగాయిపల్లి క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమైన రెస్టారెంట్లు వర్గల్ క్రాస్ రోడ్డు వరకు ఏర్పాటయ్యాయి. ఆరు జిల్లాలకు చెందిన వారు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి. సిద్దిపేటతో పాటుగా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, రాజన్న సిరిసిల్లా జిల్లాల వాహనాలు ఎక్కువగా ఇక్కడి నుంచే వెళుతుంటాయి. నగరానికి చేరుకోకముందే ఆగాలనుకునే వారికి ఇది చక్కటి స్పాట్‌గా ఉండడంతో రోజురోజుకూ ఇక్కడికి వచ్చే జనం పెరుగుతున్నారు. ఉదయం అల్పాహారం, టీ తాగేందుకు వచ్చే వారితో ప్రారంభమయ్యే సందడి.. సాయంత్రమైదంటే చాలు కనీసం వాహనాలను నిలిపేందుకు కూడా స్థలం దొరకని పరిస్థితులుంటాయి. ఏ హోటల్ వద్ద చూసినా జాతరను తలపిస్తుంది. రాజీవ్ రహదారిపై ట్రాఫిక్‌కు అంతారాయం కలగకుండా ప్రతీ రెస్టారెంట్ వద్ద సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకుంటున్నారు.



భలే రుచులు.. ఫేమస్ రెస్టారెంట్లు

ఇక్కడ జనానికి రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నారు. శాకాహారం, మాంసాహారంతో పాటు వివిధ రకాల పిండి వంటకాలను అందుబాటులో ఉంచుతున్నారు. వీటితో పాటుగా టిఫిన్‌లు, చాట్, ఐస్‌క్రీం, ఫాస్ట్‌ఫుడ్, చైనీస్, స్వీట్‌లు, బేకరీ పదార్థాలు, ఇరానీ చాయ్, పండ్ల రసాలు ఇలా అనేకం లభిస్తాయి. ఇక్కడి స్నాక్స్‌ను ప్రయాణికులు విపరీతంగా ఇష్టపడుతుంటారు. ఈ దారిలో వెళ్లే వారు తప్పకుండా వాహనాలను నిలుపుకుని ఇక్కడికి వచ్చి స్నాక్స్ తింటుంటారు. కార్న్, ఉల్లి సమోస, మక్కగారెలు, బోండా, పకోడి, మిర్చి, కట్ మిర్చి, ఆలు బజ్జి కోసం విపరీతంగా వస్తుంటారు. ఇటీవల కాలంలో ఇక్కడ ఫేమస్ రెస్టారెంట్లు సైతం వెలిశాయి. హైదరాబాద్ బిర్యానీకి ఫేమస్ అయిన ప్యారడైజ్, పసందైన రుచులతో నాన్‌వెజ్ వంటకాలను అందిస్తున్న తెలుగు అరోమా రెస్టారెంట్ సైతం ఇక్కడికి చేరుకున్నాయి. అంతేగాదు ఇటీవల నగరంలో, పట్టణాల్లో వెలుస్తున్న థీమ్డ్ కాన్సెప్ట్ అయిన ట్రైన్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. రాఘవేంద్ర హోటల్, దర్శిణి, 7హిల్స్, యతి హౌస్, స్వాగత్ రెస్టారెంట్, గోదావరి రుచులు, గ్రీన్ ఆరోమా, ఫాంస్టే రెస్టారెంట్ జనతా హోటల్, వీటితో పాటు అనేక రెస్టారెంట్లు, చాయ్ హోటళ్లకు, కేఫ్‌లకు గౌరారం కేరాఫ్ అయ్యింది. కొందరు రెస్టారెంట్ల నిర్వాహకులు అమ్మకాలు పెంచుకోవడం కోసం ఆఫర్లు ప్రకటిస్తున్నారు. మరికొందరు ఆర్టీసీ డ్రైవర్లకు స్నాక్స్‌ను ఫ్రీగా ఇస్తూ అమ్మకాలను పెంచుకుంటున్నారు. సుమారు వెయ్యి మంది హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా ఉపాధి పొందుతున్నారు.



స్నాక్స్ సెంటర్‌లో విక్రయిస్తున్న పదార్థాలు, ఒకే దగ్గర టీ, బేకరీ, సోడా దుకాణాలు

ప్రజలు ఇష్టపడే స్నాక్స్‌ని చేస్తాం



రోడ్డుపై ప్రయాణించే వారు ఎక్కువగా స్నాక్స్‌లో ఏది ఇష్టపడతారో అవే అందిస్తాం. మా వద్దకు సాయంత్రం సమయంలో జనం ఎక్కువగా వస్తారు. వారి కోసం మిర్చి, పునుగులు, కార్న్, ఉల్లి సమోస, మక్కగారెలను చేస్తుంటాం. దీంతో పాటు ఇరానీ చాయ్ లభిస్తుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్లకైతే ఉచితంగా స్నాక్ అందిస్తాం.

\- వెంకటేశ్, స్నాక్స్ సెంటర్ నిర్వాహకుడు

స్వీట్ పాన్‌లు ఎక్కువగా అమ్ముడుపోతాయి



జనంకు కావలసిన పాన్‌లు అందుబాటులో ఉంచుతాం. వారికి ఇష్టమైన పాన్‌ను చెబితే నిమిషంలో అందిస్తాం. నా వద్ద ఎక్కువగా స్వీట్ పాన్‌లు అమ్ముడుపోతాయి. పాన్‌తో పాటు రకరకాల బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు విక్రయిస్తాను.

\- ఆడెపు సంపత్, పాన్‌షాప్ నిర్వాహకుడు

తూప్రాన్‌లో యువకుడి హత్య

▸▸ హల్దీవాగులో మృతదేహం



లభించిన మృతదేహం

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేశారు. మెడకు తాడు, స్కార్ఫ్ కట్టి చంపేసినట్లు భావిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి అబోతుపల్లి శివారు గుండ్రెడ్డిపల్లి మార్గంలో హల్దీవాగులో సుమారు 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువకుడి మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. అతడి గొంతుకు ప్లాస్టిక్ తాడు, మహిళలు ధరించే స్కార్ఫ్ బిగించి ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం వచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎక్కడో హత్య చేసి, ఇక్కడ పడేసి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. సంగారెడ్డి రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని నందిని టిఫిన్ సెంటర్ వద్ద బిక్షాటన చేస్తూ తిరిగే ఒకరు ఈనెల 27న పడుకున్న స్థలంలోనే చనిపోయాడు. చనిపోయిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండి, సన్నగా చామన ఛాయ రంగు కలిగి నల్లని తల్ల వెంట్రుకలతో నాన్నాడు. ఒంటిపై బూడిదరంగు మాసిన ప్యాంటు, పసుపు పచ్చ రంగు నల్లని గీతల ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపచామని, ఎవరైనా గుర్తుపట్టిన వారు 87126 56746, 87126 56719 నంబర్లకు సమాచారం అందించాలని సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు.

ఆటోలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

ఝరాసంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గతుకుల రోడ్డుపై సమయానికి ఆస్పత్రికి చేరుకోలేక ఓ మహిళ రోడ్డుపై.. ఆటోలో ప్రసవించింది. ఆమెకు పండంటి మగ బిడ్డ పుట్టాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని పూర్యానాయక్‌తాండకు చెందిన భానోత్ స్వప్న గురువారం ఉదయం నుంచి పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు ఆమెను రెండో కాన్పుకోసం ఆటోలో ఝరాసంగం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్తున్నారు. ఝరాసంగం-పూర్యానాయక్‌తాండ రోడ్డు గుంతలతో కూడుకుని కంకర తేలి ఉండడంతో ఝరాసంగంకు సమయానికి వారు చేరుకోలేక పోయారు. దీంతో మార్గమధ్యంలోనే ఆటోలో ఆమెకు పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో తోటి మహిళలు ఆటోలోనే ప్రసవం పోశారు. ఆమెకు పండంటి బిడ్డ జన్మించింది. తర్వాత ఆమెకు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక వైద్యాధికారులను సంప్రదించగ మహిళ ఆటోలో ప్రసవించింది వాస్తవమేనని, తల్లీబిడ్డా క్షేమంగానే ఉన్నారని తెలిపారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై నిత్యం నరకం అనుభవిస్తున్నామని స్థానికులు తెలిపారు.



భానోతు స్వప్నకు జన్మించిన బిడ్డ

వెంకటాపూర్ కుంటలో ఆలయ హుండీలు

▸▸ రెండింటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో ఆలయంలో చోరీ చేసిన హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకువచ్చి తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్(పిటీ) శివారులోని కుంటలో పడేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలానికి సరిహద్దులో ఉన్న తెట్టెకుంటలో రెండు ఆలయ హుండీలు నీటిలో తేలి ఉండటం స్థానికులు గుర్తించారు. తూప్రాన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎక్కడో ఆలయంలో చోరీ చేసి, వాటిని ఇక్కడ పడేసినట్లుగా అనుమానిస్తున్నారు. నాలుగు, ఐదు రోజులుగా నీళ్లలో పసుపుపచ్చగా కనిపించగా, కుంటలో నీరు తగ్గడంతో హుండీలు కనిపించాయని చెబుతున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కుంటలో పడేసిన హుండీలు

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పది

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్

గజ్వేల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. వారివెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, నాయకులు దేవీరవీందర్, మల్లేశం, బెండే మధు, నూనె కుమార్, ఎం.శ్రీనివాస్, నవాజ్‌మీరా, రాంచంద్రం, ఊడెం కృష్ణారెడ్డి, రాచర్ల నరేశ్, పనుగట్ల శ్రీనివాస్, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, స్వామిచారి, యాదగిరి, తుమ్మ శ్రీనివాస్, చిప్పల యాదగిరి ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటయ్య

ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన

జహీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో గురువారం ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటించింది. పర్యటనలో భాగంగా వారు రంజోల్‌లోని నగరవాటికలో నాటిన చెట్లను చూసి వాటి వినియోగం గురించి మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి హోతి(కే) సమీపంలో డంప్ యార్డులో కొనసాగుతున్న చెత్త రిసైక్లింగ్ విధానాన్ని పరిశీలించారు. అందులో కంపోస్టు తయారీ, బయోమైనింగ్ ప్రాసెస్, డ్రైరిసోర్స్ కలెక్షన్ సెంటర్ తదితరాలను పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మున్సిపాలిటీలో చేపట్టబోయే వివిధ రకాల కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్‌లు వికాస్, చేతన్, అధిదిలతోపాటు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

బైక్ చోరీ కేసులో ఆరు నెలల జైలు

గజ్వేల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైక్ చోరీ చేసిన కేసులో నిందితుడికి గజ్వేల్ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.ప్రియాంక ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. మూడు నెలల క్రితం జరిగిన మోటార్ సైకిల్ దొంగతనం కేసులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం సూర్యనగర్‌కాలనీకి చెందిన శంకర్‌సింగ్(25)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి నేరం రుజువైనందున నిందితుడికి ఆరు నెలల జైలుశిక్షను విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. నిందితుడికి శిక్షపడడంలో కీలకపాత్ర పోషించిన అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ శంకర్, ఏఎస్ఐ గోపాల్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సైదా, కోర్టు కానిస్టేబుల్ కుమార్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అభినందించడంతో పాటు రివార్డును అందజేయనున్నారని తెలిపారు.

ఆలయంలో చోరీ కేసులో రెండేళ్లు

గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో చోరీ కేసులో నిందితులకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ గజ్వేల్ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి. ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి(35), ధూళిమిట్ట మండల కేంద్రానికి చెంది అల్లెపు శేఖర్(19) ఆరు నెలల క్రితం గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో మూడు గ్రాముల ముక్కుపుడక దొంగలించుకుపోయారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ జరిపిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులపై నేరం రుజువైనందున రెండేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులకు శిక్ష పడటానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, ఏఎస్ఐ గోపాల్‌గౌడ్, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, కోర్టు కానిస్టేబుల్ కుమార్ కీలకపాత్ర పోషించినందుకు సీపీ డాక్టర్ బి. అనురాధ అభినందిస్తూ, రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

ఉర్దూ మీడియం పోస్టులు భర్తీ చేయాలి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉర్దూ మీడియంలో భర్తీ కానీ మిగిలిన ఖాళీ పోస్టులను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలని కోరుతూ అభ్యర్థులు గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాబేర్‌అలీ మాట్లాడుతూ 2024 డీఎస్సీలో ఉర్దూ మీడియంలో 1,183 పోస్టులు ప్రకటించగా.. అందులో కేవలం 517 పోస్టులు మాత్రమే భర్తీ చేశారన్నారు. రిజర్వేషన్ అభ్యర్థులు లేకపోవడంతో ఉర్దూ పోస్టులు భర్తీ కానీ నేపథ్యంలో అర్హత కలిగిన అభ్యర్థులతో మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సాబేర్‌అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, నస్రీన్, బషీర్, ఖాసపాషా, ఉర్దూ ట్రైనీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠును అరికట్టేలా..

- 'ఎల్‌సీడీసీ' పేరిట ఇంటింటికి ఆరోగ్యశాఖ
- డిసెంబరు 2 నుంచి 15 వరకు ఆశాల సర్వే
- సర్వే ద్వారా 'కుష్టు' అనుమానితుల గుర్తింపు
- వ్యాధి నిర్ధారణ కోసం పీహెచ్‌సీ డాక్టర్ల వద్దకు సిఫారసు
- కార్యాచరణ రూపొందించిన వైద్య ఆరోగ్య శాఖ



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)



సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి రానున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)పేరిట వైద్య ఆరోగ్యశాఖ సర్వే నిర్వహించనున్నది. డిసెంబరు 2 నుంచి 15వ తేదీవరకు ఆశావర్కర్లు సర్వే చేయనున్నారు. ఏటా చర్మ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టే ఈ కుష్టు చాప కింద నీరులా విస్తరించి భయాందోళనకు గురిచేస్తున్నది. దీనిని ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఇదే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఎల్‌సీడీసీ పేరిట కుష్టు బాధితుల గుర్తింపు సర్వే చేయిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 15,27,628 జనాభా

జిల్లాలో 15,27,628 మంది జనాభా ఉన్నారు. అందులో 14,80,938 మందిని సర్వే చేయగా 1,815 మంది కుష్టు అనుమానితులున్నట్లు గుర్తించగా, అందులో 16 మందికి కుష్టు వ్యాధి నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. గతంలో చేసిన సర్వే మాదిరిగానే ఈసారి కూడా సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఆశా కార్యకర్తలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి సర్వే ఆదేశాలు జారీ చేశారు.

ఆశాలతో ఇంటింటి సర్వే

జిల్లాలోని పట్టణ, గ్రామాల్లోని ప్రతి ఇంటింటి ఆశా వర్కర్లు వెళ్లి సర్వే చేస్తారు. జిల్లాలోని 34 ఆరోగ్య కేంద్రాల పరిధుల్లో 934 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. సర్వే చేసినందుకుగాను ప్రతి ఆశాకార్యకర్తకు ఒకరోజుకు రూ.75 చొప్పున చెల్లిస్తారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా ప్రతి ఆశాకార్యకర్త ఒక్కోరోజు రూరల్ ఏరియాలో 20-25 ఇళ్లు, అర్బన్ ఏరియాల్లో 25-30 ఇళ్లను సర్వే చేస్తారు. శరీరంపై తెల్ల మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారిపోవడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలుంటే ఆశాలు సర్వే ద్వారా వివరాలు నమోదు చేసుకుంటారు. వీరిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని మరోసారి లెప్రసీ బృందం చేత పరీక్షలు చేయిస్తారు. వ్యాధి ఉన్నట్లు తేలితే ఎండీటీ డ్రగ్స్ లెప్రసీ చికిత్స ప్రారంభిస్తారు.

ఆదిలో గుర్తిస్తేనే మేలు

కుష్టు ప్రధానంగా మైకోబ్యాక్టీరియం లెప్రె అనే బ్యాక్టీరియా వల్లా సంక్రమిస్తుంది. కుష్టు ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్ల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వయసు, లింగ బేధం లేకుండా ఎవరికైనా ఈ వ్యాధి సోకవచ్చు. వంశపారంపర్యంగా ఈ వ్యాధి సంక్రమించదు. శరీరంలో ఏ భాగంలోనైనా సోకవచ్చు. కుష్టు బాధితులు ఎండీటీ మందులు 6 నుంచి 12 నెలలు వాడితే పూర్తిగా నయమవుతుంది. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స చేయించుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. వ్యాధిపై అవగాహన లేనివారు సరైన సమయంలో వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఇది తీవ్ర రూపం దాల్చుతోంది.

కుష్టురహిత సమాజమే లక్ష్యం



జిల్లాలో వచ్చేనెల 2 నుంచి ఎల్‌సీడీసీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే మెడికల్ ఆఫీసర్లు, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చాం. కుష్టు అనుమానితులను గుర్తించి వారందరికీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందిస్తాం. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారు. సర్వేకు వచ్చే ఆశాలకు ప్రజలు సహకరించాలి. కుష్టు వ్యాధి నిర్మూలనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

\- డాక్టర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్, సంగారెడ్డి జిల్లా

న్యూస్ బాక్స్

మురుగు కాలువ పనులు పరిశీలన

నారాయణఖేడ్, నవంబరు 28 : నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాకలి గల్లీ 3వ వార్డులో మురుగు కాలువల నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగు కాలువల నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు.

రోడ్డుపై మురుగునీటిని వదిలిన యజమానికి నోటీసులు

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీఇంటి వారు మురుగునీటిని రోడ్డుపైకి వదులుతుండడంతో ఆ ఇంటి యజమానికి గురువారం మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ నోటీసులు అందజేశారు. మురుగు నీటిని మురుగు కాలువల్లో వదిలేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరి కొయ్యలను కాల్చొద్దు: ఏడీఏ

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరికొయ్యలను కాల్చొద్దని ఖేడ్ వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. గురువారం ఖేడ్ మండలం తుర్కపల్లిలో వరికొయ్యలు తగలబెడుతున్న పొలాలను పరిశీలించారు. వాటిని కాల్చడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు.

ఉచిత వైద్య శిబిరం

నర్సాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఎల్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫార్మసీ కాలేజీ విద్యార్థులతో పాటు సెంటీనియల్ వైద్యశాల, అమోర్ వైద్యశాలు స్థానికులకు వైద్య పరీశీలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, నవంబరు 28: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని కేజీబీవీ పాఠశాలలోని 150 మంది విద్యార్థినులకు ఎంఈవో సాయిసింధు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి జ్వరం, దగ్గు, రక్తహీనత ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గీత, డాక్టర్ హరీష, సీహెచ్‌వో యాదగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 2009 కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా ఖేడ్ మండలం పలుగు తండాలో తండావాసులు నిరాహార దీక్షలు చేశారు. కొందరు జైలుకు సైతం వెళ్లారు. దీక్షా దివాస్ సందర్భంగా గురువారం మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, జైలుకు వెళ్లిన వారిని, నిరాహార దీక్షలు చేసిన వారిని శాలువాలతో సన్మానించారు. అలాగే కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఘనంగా జ్ఞానేశ్వర్ మహరాజ్ పుణ్యతిథి

నాగల్‌గిద్ద, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముక్తాపూర్‌లో గురువారం సంత్ జ్ఞానేశ్వర్ మహరాజ్ పుణ్యతిథి ఘనంగా జరుపుకున్నారు. వారికార్ భజన మండలి ఆధ్వర్యంలో భజనలతో పాటు కీర్తన నిర్వహించారు. అనంతరం జ్ఞానేశ్వర్ మహరాజ్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పెంపు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువును డిసెంబరు 11వ తేదీవరకు పొడగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్ణీత అపరాధ రుసుముతో డిసెంబరు 2వ తేదీ నుంచి పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని కోరారు.

కాజీపల్లి కాలనీ నుంచి బస్సు సర్వీసు ప్రారంభం

జిన్నారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజీపల్లి న్యూ జర్నలిస్టు కాలనీ నుంచి మియాపూర్ డిపోకు చెందిన నూతన బస్సు సర్వీసును గురువారం ప్రారంభించారు. కాలనీవాసుల విజ్ఞప్తితో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బస్సు సర్వీసు మంజూరు చేశారని నాయకులు రమాకాంత్ తెలిపారు. ప్రతిరోజు జర్నలిస్టు కాలనీ నుంచి హైటెక్ సిటీ రాక్‌వేవ్ వరకు నడిచే బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నాగరాజు

శివ్వంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని గంగయ్యపల్లిలో ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దదాసరి నాగరాజ్, ఉపాధ్యక్షుడిగా తలారి సురేష్, కోశాధికారిగా ముత్యాలు, సహాయ కార్యదర్శిగా రమాకాంత్, కోశాధికారిగా అశోక్, సలహాదారుగా యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్లాస్టిక్‌రహిత డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలి

- తడి, పొడి చెత్త సేకరణ క్షేత్రస్థాయిలోనే జరగాలి
- లేనిపక్షంలో ఇంటి యజమానులకు జరిమానాలు వేయండి
- ఎల్‌ఆర్‌ఎస్‌ను త్వరగా పూర్తిచేయాలి
- మున్సిపల్ జేడీ శ్రీనివాస్


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న జేడీ, అధికారులు

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌రహిత డంపింగ్‌యార్డుగా తీర్చిదిద్దాలని, ఇందుకు ఇటీవలే వచ్చిన కమిషనర్ దృష్టిసారించాలని మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని డంపింగ్‌యార్డును శ్రీనివాస్‌రెడ్డి పారిశుధ్య అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ తయారుచేస్తున్న వర్మీ కంపోస్టు విధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ తరలిస్తున్న చెత్తాచెదారాల్లో ప్లాస్టిక్ ఎక్కువగా ఉండటంతో అధికారులపై మండిపడ్డారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను వేరుచేయాల్సి ఉండగా- అది ఇక్కడ జరగడం లేదన్నారు. చెత్త సేకరణ సమయంలోనే తడి, పొడి వేరుగా తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి ప్లాస్టిక్ కవర్లను వేరు చేయని వారిని, తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వని వారిపై అవసరమైతే జరిమానాలు విధించాలన్నారు. డంపింగ్‌యార్డు అంటే క్లీన్‌గా ఉండాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగంపై కట్టడి చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మకందారులను నియంత్రిస్తే ముందు మార్పు కనిపిస్తుందన్నారు. మళ్లీ వచ్చేసరికి పట్టణమంతా తడి, పొడి చెత్తను వేరుగా ఇస్తూ ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా చూడాలన్నారు. అక్కడే ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారి భూపతితో మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం ఎంతవరకు వచ్చిందని, ఇప్పటివరకు ఎంతమంది రెగ్యులరైజ్ చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. త్వరగా దరఖాస్తులను పూర్తిచేయించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఉన్నారు. అలాగే రామాయంపేటలోని డంపింగ్‌యార్డును మున్సిపల్ అడ్మినిస్ట్రేట్ జాయింట్ డైరెక్టర్ బీ.శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని సీడీవో హేమలతో కలిసి మాట్లాడారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ దేవేందర్ ఉన్నారు.

దీక్షా దివాస్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


దీక్షా దివాస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభాకర్

కంది/నర్సాపూర్/చిన్నశంకరంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కందిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివాస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో దీక్షా దివాస్ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల పార్టీల కార్యాలయాల్లో ఈ కార్యక్రమన్ని చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన మెదక్‌లో నిర్వహించనున్న దీక్షా దివాస్‌కు అందరూ తరలిరావాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, నాయకులు పాల్గొన్నారు. దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన చిన్నశంకరంపేటలో మాట్లాడారు.

హనుమాన్ ఆలయ ఉత్సవాల్లో ఎమ్మెల్యే


ఆలయ సంప్రోక్షణలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మనోహరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం గౌతోజీగూడ గ్రామంలో హనుమాన్ ఆలయ సంప్రోక్షణ నిర్వహించారు. ఇందులో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో పూజ, హోమం నిర్వహించారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ హరికృష్ణ, ఉపసర్పంచ్ రేణుకుమార్, చంద్రగౌడ్, మన్సూర్, రమణగౌడ్ ఉన్నారు.

జ్యోతిబాపూలే సేవలు మరువలేనివి

- ఏఐయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్


పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబాపూలే సేవలు మరువలేనివని ఆలిండియా యువజన సంఘం(ఏఐయూ) జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని ఆయన విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక విప్లవ యోధుడని, అణగారినవర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు అనంతయ్య, మాజీ ఎంపీపీ బైండ్ల అశోక్‌కుమార్, మాజీ ఎంపీటీసీ నందకిషోర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలి

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

హవేళిఘణపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో అవకతవకలపై డీఎల్పీవో విచారణ

- తప్పుడు ఇంటి అడ్రస్‌లతో వార్డుల మార్పులు
- ఇద్దరు నాయకుల మధ్య వాగ్వాదం


దౌల్తాబాద్‌లో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో అనిత

హత్నూర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామపంచాయతీ ఓటర్ లిస్టులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై సంగారెడ్డి డీఎల్పీవో అనిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం విచారణ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొందరు నాయకులు అధికారుల సహకారంతో పలు వార్డుల్లోని ఓటర్లను ఇష్టానుసారంగా మార్చారని విచారణ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 1,336 ఓట్లు మార్పులు జరిగాయని వివరించారు. అంతలోనే కాంగ్రెస్ నాయకులు సాయికుమార్, మాజీ వార్డుసభ్యుడు వెంకటేష్‌గౌడ్ మధ్య మాట మాట పెరిగి విచారణ అధికారి సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న నాయకులు కొందరు ఇరువురికి సర్ది చెప్పారు. ఓటర్ల లిస్టులో కొంత మార్పులు చేర్పులు జరిగినట్లు తమ విచారణలో తేలిందని, ఈ విచారణ నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేయనున్నట్లు అనిత స్పష్టం చేశారు. వీరి వెంట ఎంపీవో యూసుఫ్, గ్రామ కార్యదర్శి బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు

ఫుడ్ పాయిజన్ ఘటనలపై నిర్లక్ష్యం వీడాలి: ఏబీవీపీ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాశ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద ఫుడ్ పాయిజన్, విద్యార్థుల ఆత్మహత్య ఘటనలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆకాశ్ మాట్లాడుతూ గురుకులాలు, వసతి గృహాలు, కేజీబీవీల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మహేశ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాజు, శశాంక్, మల్లేష్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం'

జిన్నారం/పటాన్‌చెరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. జిన్నారం మండలం ఊట్లలో దాతల సహకారంతో నిర్మించిన మత్స్య సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్డె కృష్ణ, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి నీలం మధుముదిరాజ్ నివాళులర్పించారు.

పందులను తరలించకుంటే చర్యలు: మున్సిపల్ కమిషనర్

నారాయణఖేడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలో సంచరిస్తున్న పందులను ఇతర ప్రాంతాలకు తరలించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పందుల యజమానులతో ఆయన మాట్లాడుతూ కాలనీల్లో, రోడ్లపై పందులు సంచరిస్తుండడంతో స్థానికు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని శుక్రవారం లోపు తరలించకుంటే తామే ఇతర ప్రాంతాలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు


మనూరు మండలం బెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి

మనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా, సక్రమంగా వడ్డించకుంటే కఠిన తీసుకుంటామని ఆర్డీవో అశోకచక్రవర్తి హెచ్చరించారు. గురువారం మనూరు మండల పరిధిలోని బెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా వడ్డించడం లేదన్న ఫిర్యాదుతో, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

●కల్హేర్: మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కేజీబీవీ, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలు, మండల పరిధిలోని నల్లవాగు సాంఘీక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలను సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనం, వసతి, విద్యాభ్యాసం, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. పరిశుభ్రమైన భోజనం, నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఆయన వెంట సిర్గాపూర్ తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో మల్యూర్‌నాయక్, ఎంఈవో నాగారం శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్ తిరుపతయ్య, శైలజ, కేజీబీవీ ఎస్‌వో సంతోషి, సీఆర్పీ శివకుమార్ తదితరులు ఉన్నారు.

●కంగ్టి: మండల కేంద్రమైన కంగ్టిలోని గిరిజన బాలుర గురుకుల విద్యాలయాన్ని గురువారం ఎమ్మార్వో అబ్దుల్ నజీంఖాన్ తనిఖీ చేశారు. స్టాక్‌రూంను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు.

మెదక్ జిల్లాలో

తూప్రాన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని రావెల్లిలో నిర్వహిస్తున్న నర్సాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలను, పోతరాజుపల్లిలోని వెల్దుర్తి మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలను, తూప్రాన్‌లోని బాలుర సమీకృత హాస్టల్‌ను జడ్పీ సీఈవో ఎల్లయ్య ఎంపీడీవో శేషాద్రి, ఎంఈవో పర్వతి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సాపూర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రహరీ సక్రమంగా లేదని గుర్తించారు. వెల్దుర్తి పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు వస్తున్నట్లు గుర్తించారు.

●కౌడిపల్లి: మండల పరిధి తునికిలోని ఎంజేపీ గురుకుల పాఠశాలను జిల్లా ఆర్సీవో గౌతంరెడ్డి గురువారం తనిఖీ చేశారు. అనంతరం వంటలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

●చిన్నశంకరంపేట: మండలంలోని ఖాజాపూర్, రామాయపల్లి, శాలిపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ పరిశీలించారు.

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల వంట గదులను ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తనిఖీ చచేశారు. ఆయన వెంట కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.


తూప్రాన్‌లో జ్యోతిబాపూలే విద్యాలయంలో తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో, ఎంపీడీవో, ఎంఈవో

●శివ్వంపేట : మండల కేంద్రమైన శివ్వంపేటలోని గిరిజన బాలుర, గోమారంలోని బీసీ బాలుర, దొంతిలోని ఎస్సీ వసతి గృహాలను, గూడూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి ప్రతాప్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్, మండల ఫుడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, ఎంపీడీవో నాగేశ్వర్, ఎంఈవో బుచ్చానాయక్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనాన్ని, వంటగదిని కూరగాయలను పరిశీలించి కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాగా ఉసిరికపల్లి, పోతులబోగుడ, పిల్లుట్ల గ్రామాల్లో పాఠశాల, అంగన్‌వాడీలో భోజనాన్ని, వంటటాలను డిప్యూటీ తహసీల్దార్ షఫియోద్దీన్ వేర్వేరుగా పరిశీలించి కలెక్టర్‌కు నివేదించించినట్లు తెలిపారు.

●నర్సాపూర్: నర్సాపూర్ మండలంలోని వసతిగృహాలను డీఆర్‌డీఏ పీడీ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో మాధవీలత, ఎంఈవో తారాసింగ్ కలిసి పరిశీలించారు. వసతి గృహాల్లోని వంట గది, భోజనాన్ని పరిశీలించారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


ప్రభుత్వాస్పత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భూపాల్

జహీరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదిన పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అసెంబ్లీసమావేశాల్లోగా కార్మికులకు వేతనాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మైపాల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా పెన్షన్ పెంచి ఆదుకోవాలి'

చేగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల ఆసరా పెన్షన్ పెంచి ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు ధర్మాకర్ శ్రీధర్ కోరారు. ఈ విషయమై గురువారం నార్సింగి ఎంపీడీవో ఆనంద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దివ్యాంగుల ఆసరా పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందరి రాంచంద్రం, బాలరాజు, పోచయ్య, ఫరూక్, యాదగిరి, అఫ్సర్, దుర్గయ్య, నర్సవ్వ, బీజాన్, బికుల్యూమ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ


పూజలు చేస్తున్న అయ్యప్పస్వాములు

చేగుంట/జిన్నారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గురుస్వామి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర ఆలయంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యావాది జనార్దన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గంగ నరేందర్, మాజీ సొసైటీ చైర్మన్ వెంగళరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిన్నారం మండలంలోని కొడకంచి ఆదినారాయణస్వామి ఆలయం వద్ద అయ్యప్ప మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, అయ్యప్పస్వాములు హాజరయ్యారు.

'పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం'

జిన్నారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో 'పార్కు స్థలానికి రక్షణ కరువు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి నవీన్, ఏఈ కిష్టయ్య పార్కును సందర్శించారు. చెట్లు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించి, పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రైవేటు వాహనాల పార్కింగ్ తొలగించి, పార్కు స్థలాన్ని పూర్తిస్థాయిలో రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

విద్యుత్ వైర్లు సరిచేస్తాం: ఏఈ


బాల్‌రెడ్డి పంట పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

గుమ్మడిదల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండల కేంద్రంలో 50 ఏళ్ల క్రితం పంట పొలంలో నిర్మించిన విద్యుత్ లైన్లు, స్తంభాలు నేలకొరిగాయని ఈ నెల 26న 'ఎన్నాళ్లీ కష్టాలు' అనే వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ రవీంద్రరావు, లైన్‌మన్ పాండు రైతులు మద్దుల బాల్‌రెడ్డి, రామిరెడ్డితో కలిసి గురువారం పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను పరిశీలించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు.

సమాజంలో యువత పాత్ర కీలకం: సీఐ

మెదక్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత పాత్ర కీలకమని, మహిళల చైతన్యంతో దేశాభివృద్ధి సాధ్యమని పట్టణ సీఐ నాగరాజు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 'మహిళల రక్షణ-సైన్స్-మూఢనమ్మకాల నిర్మూలన' అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢ నమ్మకాలను వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్, ప్రిన్సిపల్ భవాని, సఖి ఇన్‌చార్జి రేణుక, మహిళా సాధికారత కోఆర్డినేటర్ సంతోషిని తదితరులు పాల్గొన్నారు.

'కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు అందించాలి'

రేగోడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాలో పనిచేస్తున్న టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్లకు ఏడాదిగా వేతనాలు లేవని, వేతనాలు వెంటనే మంజూరు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశం అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లక్లు ఓ ఏజెన్సీ ద్వారా వేతనాలు అందిస్తున్నారన్నారు. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మంజూరు చేయాలని కోరారు.

కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన

చిలప్‌చెడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ చిలప్‌చెడ్ మండలం చిట్కుల్‌లోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మధులత మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పాపన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పాపన్నపేట సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. ఉదయం హారతి, పుణ్యవచనం, గణపతి పూజ, క్షీరాభిషేకం, సత్యనారాయణస్వామి వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శెట్టి వీరప్ప అన్నదానం చేపట్టారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

మెదక్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి కట్టడానికి వంద ఏండ్లు నిండిన సందర్భంగా చర్చి ఆవరణలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మెన్స్ ఫెల్లోషిప్ భవనానికి భూమి పూజతో పాటు, ఇటీవల నిర్మించిన దుకాణ సముదాయాన్ని గురువారం ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ ప్రారంభించారు. అనంతరం ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జీ.సంపత్, సంజయ్‌కుమార్, మత గురువులు, మతపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.